క్లుప్తంగా

నేడు స్తంభాద్రి గిరి ప్రదక్షిణ

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం శనివారం సాయంత్రం 5–30 గంటలకు ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట) చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. స్వామి వారి ఉత్సవమూర్తులను కొండ పైనుంచి తీసుకొచ్చి గిరిప్రదక్షిణ నిర్వహించనుండగా, ఆతర్వాత నక్షత్ర జ్యోతి వెలిగిస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు కోరారు.

విద్యుత్ అంతరాయం

కూసుమంచి: పోచారం ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గృహాలకు, వ్యవసాయ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

జాబ్‌మేళా..

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు 48 మంది హాజరయ్యారు. ఏఎస్ఎఫ్ స్మాల్ ఫైనాన్స్ కంపెనీల్లో వివిధ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 10 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి త్వరలోనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిణి ఎస్.మాధవి తెలిపారు.

రాజీనామా..

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు గ్రామానికి చెందిన గుజ్జరపూడి రాంబాబు వ్యక్తిగత కారణాల వల్ల కామేపల్లి పీఏసీఎస్ సొసైటీ వైస్ చైర్మన్ పదవికి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగానే కొనసాగుతానన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ అకౌంట్స్ ఆఫీసర్‌గా సీహెచ్.శ్రీనివాస రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇల్లెందులో పనిచేస్తున్న ఆయన డిప్యూటేషన్‌ను రద్దు చేసి ఖమ్మంకు బదిలీ చేస్తున్నట్లు సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే కేఎంసీ ఆర్ఓగా నేరేడుచర్ల మున్సిపాలిటీ మేనేజర్‌గా పని చేస్తున్న యాకూబ్‌పాషాను నియమించగా.. కేఎంసీలో ఆర్ఓ అయిన శ్రీధర్ డిప్యూటేషన్‌ను రద్దు చేసి మహబూబాబాద్‌కు పంపారు.

ఖమ్మం డెయిరీ డీడీగా రవికుమార్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్‌గా కోడిరెక్క రవికుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను ఖమ్మానికి, ఇక్కడ డీడీ పి.మోహన్‌మురళిని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. శుక్రవారం ఈమేరకు రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు.

పార్టీ గెలుపే లక్ష్యం

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తకొత్తూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, మల్లేబోయిన గోవిందరావు, గెల్లా చక్రపాణి, పురాణం దివాకర్, తంగెళ్ల సతీష్, తేజావత్ నాగరాజు, మూడు రమేష్, కళ్యాణం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ శిబిరం



బహుమతులు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన ఖమ్మం రూరల్ మండలం పెద్ద వెంకటగిరిలో నెల పాటు నిర్వహించిన నెట్‌బాల్ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి పోటీలు నిర్వహించగా, విజేతలకు డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథబాబు, ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీదేవి, పాఠశాల హెచ్‌ఎం ఏ.నాగేశ్వరరావు, కోచ్ పీ.వీ.రమణ, సీహెచ్.దీప్తి పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇప్పటివరకు నిరుద్యోగులకు రూ.4వేలు భృతి ఇవ్వకుండా గత ప్రభుత్వం మాదిరిగా కాలయాపన చేస్తుందని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రాకేష్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ భృతితో పాటు ప్రభుత్వమే కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి స్టడీ మెటీరియల్ అందించాలని, లైబ్రరీల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీవైఎల్ డివిజన్ కార్యదర్శి భరత్, నగర అధ్యక్ష , కార్యదర్శులు ధరణ్, రవీందర్, నాయకులు రమేష్, బాలు పాల్గొన్నారు.





డేంజర్ సర్కిల్..

ఎన్టీఆర్ జంక్షన్‌లో వరుస ప్రమాదాలు

- తరచుగా ట్రాఫిక్ జామ్.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- లోపభూయిష్టంగా రింగ్ నిర్మాణమే కారణం?
- ట్రాఫిక్ సిగ్నల్ సమయాల్లోనూ లోటుపాట్లు



అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనదారులు

ఖమ్మంక్రైం: ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ డేంజర్‌గా మారింది. వరుస ప్రమాదాలతో వాహనదారులపాలిట యమపాశమైంది. ఈ సర్కిల్‌లో జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారుల ప్రయాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అంతేకాక రింగ్ నిర్మాణం, సిగ్నల్ సమయంలో లోటుపాట్లతో ట్రాఫిక్ జామ్ కావడం, ప్రమాదాలు జరగడం నిత్యకృత్యంలా మారింది.

రద్దీని పరిగణనలోకి తీసుకోకుండా...

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్‌లో సమయం ఏర్పాటులో లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాక సమయంపై వాహనదారులకు సరైన అవగాహన లేక, సూచిక బోర్డులు కానరాక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సర్కిల్‌లో వైరా, వరంగల్ క్రాస్, ఖానాపురం, ఇల్లెందు క్రాస్ వైపు సిగ్నళ్లు ఉంటాయి. ఇందులో ఖానాపురం, ఇల్లెందు క్రాస్ వైపునకు వాహనాల రద్దీగానే ఉంటుంది. ఇక వైరా వైపు, వరంగల్ క్రాస్ వైపు మాత్రం 24గంటల పాటు భారీ వాహనాలతో తోడు ఇతర వాహనాలు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ రెడ్ సిగ్నల్ రెండు నుంచి నిమిషాలకు పైగా ఉండడం, గ్రీన్ సిగ్నల్ నిమిషం కూడా లేకపోవడం ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతోంది. రెడ్ సిగ్నల్ పడినంత సేపు పెద్దసంఖ్యలో భారీ వాహనాలు నిలుస్తుండగా.. గ్రీన్ పడగానే త్వరగా సిగ్నల్ క్రాస్ చేయాలనే ఆతృతలో భారీ, చిన్న వాహనదారులు ముందుకు వెళ్తుండడం సమస్యకు కారణమవుతోంది.

గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభమైతేనే..

గ్రీన్ ఫీల్డ్‌హైవే ప్రారంభమైతే తప్ప ఖమ్మం బైపాస్‌రోడ్డులో ట్రాఫిక్ తగ్గే అవకాశం లేదని చెప్పొచ్చు. హైవే అందుబాటులోకి వస్తే హైదరాబాద్, వైజాగ్ వైపు వెళ్లే లారీలు, భారీవాహనాలు బైపాస్ రోడ్డు మీదకు వచ్చే అవకాశముండదు కనుక ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఉన్నాయి. కొద్దినెలల్లో హైవే పనులు పూర్తికానుండగా.. అప్పటి వరకైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

బైపాస్ రోడ్డులో, ప్రధానంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో జరిగే రోడ్డు ప్రమాదాలు వాహనదారులను కలవరపెడుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ సర్కిల్ వద్ద పలుమార్లు ట్రాఫిక్ పోలీసులు కనిపించడం లేదని.. వేగంగా వెళ్లే వాహనాలను అదుపులో పెట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది.

రింగ్‌లోనూ లోపాలు..

గతంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రింగ్ మరింత పెద్దగా ఉండేది. ఆతర్వాత రింగ్ వెడల్పు కొంత మేర తగ్గించారు. కానీ వైరా – వరంగల్ క్రాస్ రోడ్డు వైపు రాకపోకలు సాగించే వాహనాలు సాఫీగా వెళ్లే వీల్లేదు. కాస్త వంపు తిరగాల్సి ఉండడంతో భారీ వాహనాల ముందు భాగం వెళ్లినా వెనుక భాగం తిరిగే లోగా ఇతర వాహనాలు వస్తుండడంతో ప్రమాదానికి కారణమవుతోంది. ఈ విషయంపై సరైన అవగాహన లేక కొందరు త్వరగా సిగ్నల్‌ను దాటాలనే భావనతో వెళ్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మూడు రోజుల క్రితం ఈ సర్కిల్ వద్ద కి.మీ. మేర ట్రాఫిక్ జామ్ అయింది. అలాగే, గురువారం ఓ లారీ డ్రైవర్ గ్రీన్ సిగ్నల్ పడగానే త్వరగా వెళ్లాలనే భావనతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా తండ్రీకుమారులు ప్రాణాలు కోల్పోయారు. అంతేకాక ఎన్టీఆర్ సర్కిల్‌లోని సిగ్నల్ పాయింట్ వద్ద ఈ సంవత్సరం ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..

తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎన్టీఆర్ సర్కిల్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గతంలో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించి లారీలు, భారీ వాహనాలను బ్రిడ్జి పైనుంచి, నగరంలోకి వచ్చే చిన్న వాహనాలనే రహదారిపై అనుమతించాలనే ప్రతిపాదన ఉంది. అయితే, గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుండడంతో బైపాస్‌పై వాహనాల సంఖ్య తగ్గే అవకాశముంది. అప్పటివరకు సూచిక బోర్డులు ఏర్పాటుతో పాటు ఇతర రక్షణ చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, ట్రాఫిక్ ఏసీపీ

అంగన్‌వాడీల్లోనే చిన్నారుల భవిష్యత్‌కు పునాది



ర్యాలీలో పాల్గొన్న కేఎంసీ కమిషనర్, ప్రజాప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ కేంద్రం చిన్నారుల భవిష్యత్‌కు పునాది అని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. శుక్రవారం నగరంలోని 60వ డివిజన్ 2బీహెచ్‌కేలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించి కేంద్రంలో లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లల తల్లిదండ్రులను వ్యక్తిగతంగా కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకుని చిన్నారులతోఅక్షరాభ్యాసం చేయించి స్వీట్లు తినిపించారు. 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట'పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీలో కమిషనర్ స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆ తర్వాత 2బీహెచ్‌కే కాలనీలో నూతనంగా గృహప్రవేశం చేస్తున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన కమిషనర్ వారిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



తిరుమలాయపాలెం: బచ్చోడులో పట్టాలు అందుకున్న లబ్ధిదారులు

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈనేపథ్యాన నేలకొండపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అందివ్వగా, తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో కాంగ్రెస్ నేతలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నందున లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, కాంగ్రెస్ నాయకులు వెంకన్న, సత్యనారాయణ, హనుమంతరావు, మల్లయ్య, నరేష్, అరవిందరెడ్డి, మాజీ సర్పంచ్ రామసహాయం హరితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన



మొక్క నాటుతున్న విజయారెడ్డి, తదితరులు

కూసుమంచి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనతోనే దేశంలో సుపరిపాలన అందుతుందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయారెడ్డి అన్నారు. శుక్రవారం కూసుమంచిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థాయి నుంచి నలుదిశలా విస్తరింపజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భరతమాతకు నివాళులర్పించి మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షురాలు పుణ్యవతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు శంకర్, రవి, రాములు, వినోద్, మధు, భద్రయ్య పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు..

నేలకొండపల్లి: డ్రగ్స్ మాఫియా నుంచి యువతను కాపాడాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్ అన్నారు. గత నెల 30న చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం నేలకొండపల్లికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా యువశక్తిని మేల్కొల్పేలా ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాల బారిన పడకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బషీరుద్దీన్, ప్రభాకర్, రైతు సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, కట్టెకోల వెంకటేశ్వర్లు, రాసాల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

'చేప మందు ఉబ్బసానికి పనికిరాదు'



సమావేశంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు, వైద్యులు

ఖమ్మం సహకారనగర్: ఉబ్బసానికి చేప మందు పనికిరాదని, దాని వల్ల అనేక దుష్ఫలితాలే ఉన్నాయని వైద్యులు పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యాన నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వైద్యులు సి.భారవి, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్‌పీవీ గణేష్‌బాబు, కొప్పు ధనమూర్తి, గోపగాని సురేందర్ పాల్గొని ప్రసంగించారు. ఉబ్బసం వాయు సంబంధ కాలుష్యాల వల్ల సోకే వ్యాధి అని, దీనికి చేప మందు సరైందికాదన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి అలవాల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.మోహన్, కె.రామారావు, కోశాధికారి టి.శివన్నారాయణ, నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, ఎస్‌వీ ఆర్.పురుషోత్తమరావు, టి.రాఘవయ్య, ఆర్.శ్రీరాములు, డాక్టర్ సుబ్బారావు, జిల్లా నాయకులు నామా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గౌడ ఆత్మగౌరవ సభ ఏర్పాట్లు పరిశీలన

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో ఈ నెల 9న జరగనున్న గౌడ ఆత్మగౌరవ సభ ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. సభను విజయవంతం చేసేలా గౌడ వర్గీయులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం ప్రకటించాలన్నారు. జిల్లా గౌడ సంఘం నేతలు వెంకన్న, విజయ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, ఉపేందర్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్యాబోధన జరుగుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య పొందాలని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేశారు.

– సాక్షినెట్‌వర్క్



రఘునాథపాలెం పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ రాములు



నేలకొండపల్లి: మండ్రాజుపల్లి బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



తిరుమలాయపాలెం: పిండిప్రోలులో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య , రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, వారు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కామేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నాక తాళ్లగూడెంలో సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళా శక్తి గ్రూపులకు ప్రత్యేక రుణాలు ఇవ్వనున్నారని, భూభారతి ద్వారా భూ సమస్యల పరిష్కారమవుతాయని తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన తాళ్లగూడెం ఆర్ఎంపీ వైద్యులు దారా సుందర్‌రావును ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, సీఎస్‌సీ జిల్లా మేనేజర్ సురేష్, నాయకులు లక్ష్మయ్య, ఫయాజ్, అరుణ, రమేశ్‌బాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో రైతుల విజ్ఞానయాత్ర



ఎరువుల తయారీని వివరిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ వ్యవసాయ డివిజన్ పరిధిలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం రైతు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల ఆత్మ డైరెక్టర్లు, రైతులను సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లోని ఆయిల్‌పామ్ తోటలకు తీసుకెళ్లారు. అక్కడ పంట సాగు విధానం, యాజమాన్య పద్ధతులు, అంతరపంటల సాగుకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. అలాగే, ఆయిల్‌పామ్ గెలల నుంచినూనె తీసే విధానం, శుద్ధి ప్రక్రియను వివరించారు. ఖమ్మం అర్బన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఉద్యానవన అధికారి నగేష్‌తో పాటు గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు చందు, రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణకు ఒక్క పథకమూ ప్రకటించలేదు..



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మాటల విలువ లేకపోగా, రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌లా మారారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీఎం 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం.. నమ్మకుంటే ఓటు వేయొద్దని చెప్పడంతో గ్రాడ్యుయేట్లు అలా చేశారన్నారు. కాగా, కేబినెట్ భేటీ ఆరు గంటలపాటు సాగితే ఉద్యోగ నోటిఫికేషన్లు సహా ఏ పథకంపైనా చర్చించలేదని తెలిపారు. ఇక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్త పథకాన్ని ప్రకటించకపోవడం గర్హనీయమన్నారు. రాజీవ్ యువవికాసం పేరుతో లక్షల్లో దరఖాస్తులు అందితే అమలుపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇక ఉద్యోగులకు డీఏ, రైతులకు విత్తనాలు సరిపడా సమకూర్చడంలోనూ ప్రభుత్వం విఫలమైందని రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, గుండ్లపల్లి శేషగిరిరావు, బొమ్మెర రామూర్తి, మహమ్మద్ రసూల్, బంక మల్లయ్య, కోటి అనంతరాములు, ఉద్యమకారులు కోడిరెక్క ఉమాశంకర్, నెమలికొండ వంశీ, దరిపెల్లి వీరబాబు, బలుసు మురళీకృష్ణ పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న స్నేహితులు

కూసుమంచి: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్నేహితుడికి వైద్య ఖర్చుల నిమ్మితం తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించి ఆసరాగా నిలిచారు. కూసుమంచి ఉన్నత పాఠశాలలో పదోతరగతికి చెందిన(1988–89 బ్యాచ్) నలగాటి వీరయ్య ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.36 వేలను సేకరించి శుక్రవారం ఆస్పత్రిలో వీరయ్యకు అందజేశారు.

మృతుల కుటుంబాలకు పొంగులేటి సాయం..

నేలకొండపల్లి: మండలంలో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నేతలు అందించారు. ఈమేరకు శుక్రవారం ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున 15 కుటుంబాలకు అందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, కుక్కల హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, నర్సయ్య, సుభద్ర, నరేష్, పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్పీ సతీమణి ఉదారత..

ఖమ్మంఅర్బన్: మాజీ ఎస్పీ టి.జనార్దన్ జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి పోలీసు అసోసియేషన్ నుంచి మృతుల కుటుంబానికి అందించే రూ.18 వేలను శుక్రవారం అన్నం ఫౌండేషన్‌కు వితరణగా అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.వెంకటనారాయణ, వైస్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు, సంఘ కార్యనిర్వాహకుడు టి. రామచంద్ర రాజు హాజరయ్యారు.

బల్లేపల్లి భూ భారతి గ్రామసభ వెలవెల..

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంలో కొనసాగుతున్న భూ భారతి గ్రామసభల్లో సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తులు లేకపోవడంతో అంతగా ఆదరణ కనిపించడం లేదు. శుక్రవారం నగరంలోని బల్లేపల్లిలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సాయినరేష్, ఇతర కార్యాలయ సిబ్బంది, కార్పొరేటర్ లకావత్ సైదులు తదితరులు మొత్తం 10 మంది పాల్గొనగా.. కేవలం 13 దరఖాస్తులే అందినట్లు అధికారులు తెలిపారు. కాగా, నగరం పరిధిలో కూడా సాదాబైనామాకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు. అలాగే రఘునాథపాలెం మండలం బూడిదంపాడులో జరిగిన గ్రామసభలో 62 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఆత్మకమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాక కోటపాడు గ్రామ సభలో 66 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్‌రావు, ఆర్ఐ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో 257 దరఖాస్తులు..

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు, జూపెడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 257 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ విల్సన్ తెలిపారు. ఎదుళ్లచెరువులో 135, జూపెడలో 122 దరఖాస్తులు వచ్చాయని, సాదాబైనామా, ఇతర భూ సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, ఆర్ఐలు రేసు వీరయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అస్తవ్యస్తంగా పార్కింగ్..



ఐడీఓసీ ఎదుట..



హెలీప్యాడ్ వద్ద..

కలెక్టరేట్ ఆవరణలో వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడ పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించినా కార్యాలయానికి వచ్చేవారు తమ వాహనాలను ఎక్కడ బడితే అక్కడ నిలుపుతున్నారు. నో పార్కింగ్ అని బోర్డు పెట్టినప్పటికీ ఖాతరు చేయకుండా నో పార్కింగ్ స్థలంలో, హెలీప్యాడ్ స్థలంలో వాహనాలను నిలుపుతున్నారు. దీంతో హెలీప్యాడ్ దెబ్బతింటోంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్